# గుట్టు రట్టు

"హలో, రాజశేఖరంగారున్నారా?''

''స్పీకింగ్....''

''నమస్కారం సార్.... నా పేరు రజని.''

''నమస్కారమండి....''

''మీ రచనలంటే నాకెంతో ఇష్టమండి.''

''చాలా సంతోషమండి.''

"నాకూ చాలా సంతోషంగా వుందండి. నా అభిమాన రచయితతో ఇలా ఫోన్ ద్వారానయినా మాట్లాడగల్గుతున్నందుకు....''

''భలేవారే! అనుకోవాలేగానీ ఫోన్ ద్వారానే ఏమి ఖర్మ- ముఖాముఖీనే మాట్లాడుకోవచ్చు....''

''థాంక్యూ....''

''నోమెన్షన్.''

"మిమ్మల్ని ఎలా కలుసుకోవాలి? ఆఫీసుకి రమ్మంటారా?''

''అమ్మమ్మ.... ఆ పని మాత్రం చెయ్యకండి. ఇక్కడున్న మగాళ్ళందరూ దగుల్బాజీ వెధవలు. పరాయి ఆడది కనిపిస్తే చాలు-ఎలా ప్రవర్తిస్తారో వాళ్ళకే అర్థం కాదు....''

''పోనీ, మీ ఇంటి అడ్రసు చెప్పండి. అక్కడికే వస్తాను.''

"బాబోయ్....ఆ పని అసలు చెయ్యకండి. అదంతకన్నా డేంజర్...."

''ఏమండీ.... మీ ఇంటి దగ్గర కూడా దగుల్బాజీ మగ వెధవ లున్నారా?''

''అంతకన్నా పెద్ద దగుల్బాజీ ఆడవెధవ ఉంది. నా కోసం ఎవరయినా ఆడపిల్ల వస్తే ఇంకేమయినా వుందా, అది అనుమానంతో కుళ్ళిపోతుంది!''

''నిప్పులేనిదే పొగ రాదని మీ కథల్లో తెగ రాస్తుంటారుకదండీ?''

''కథలు వేరు, జీవితం వేరు. ఆ విషయాలు అంతటితో వదిలేయండి. సాయంత్రం సరిగ్గా ఆరు గంటలకల్లా లిబర్టీకి వచ్చేయండి. ఫస్ట్ షో చూస్తూ కబుర్లు చెప్పుకుందాం.''

''అలాగే బావా....''

''బావా!''

''అవును బావా—నేను రమని. మీ మరదలిని. ఇందాకే వచ్చాను వూరు నుంచి. అక్కయ్య ఇలా ఫోన్ చెయ్యమంటే చేసాను. అక్కయ్య మాట్లాడుతుందిట, మాట్లాడు.''

''నేను సాయంత్రం సినిమాకి వెళ్దామంటే అర్జంటు ఆఫీసు పను లున్నాయన్నారు?''

''అబ్బే.... ఏంలేదు.... పెందలాడే వచ్చేస్తాను. ముగ్గురం సినిమాకి వెళ్దాం.''

''పక్కన నేనున్నా, మీతో పాటు మా చెల్లెల్ని సినిమాకి చచ్చినా రానివ్వను....''

''నాకు అర్జంటు పనుంది. తొందరగా వచ్చేస్తాతే.''

(ఉదయం వారపత్రిక)